
సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం | 6 | డిసెంబర్ | 2024



ఆటల్లో ఆణిముత్యాలు

మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. - 8లో▸



అభివృద్ధి దిశగా ఉర్సు గుట్ట

వరంగల్‌లోని ఉర్సుగుట్టను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అడుగులు పడుతున్నాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
30°/22°

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత కాస్త పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నిట్‌లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ప్రారంభం



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్‌లో మేథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'న్యూమరికల్ ఆప్టిమైజేషన్ ఇన్ ఇంజనీరింగ్ అండ్ సైన్సెస్' అంశంపై ఏర్పాటు చేసిన మూడు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కుటుంబ జీవితమైనా, ఇంజనీరింగ్ సమస్యలైనా ఆప్టిమైజేషన్ జీవితంలో ఓ భాగమేనన్నారు. ఆప్టిమైజేషన్‌లో నూతన పరిశోధనలకు వేదికగా కాన్ఫరెన్స్ వేదికగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సుగనాథన్, జగన్నాథ్, సుజిత్ దాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేయూ పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: పీజీ కోర్సుల(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల18నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి పేపర్ ఈనెల 18, 20, 23, 27,30,జనవరి 2న పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

కేయూ పరీక్షల నియంత్రణాధికారిగా రాజేందర్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిగా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌ను నియమిస్తూ గురువారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రాజేందర్ ప్రస్తుతం కేయూ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్‌గా, కామర్స్ విభాగం బీఓఎస్‌గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి నియామక ఉత్తర్వులు రాజేందర్‌కు అందజేశారు. ఆయన ఒక సంవత్సరం పాటు ఈబాధ్యతలు నిర్వర్తించనున్నారు.

25మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడివరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల వివిధ సెమిస్టర్‌ల పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన మొదటి, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో పలు సెంటర్లలో కాపీయింగ్ చేస్తూ 25 మంది విద్యార్థులు పట్టుబడి డీబార్ అయ్యారని అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు.

అంతర్జాతీయ సదస్సుకు ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి



కేయూ క్యాంపస్: కాకతీయ వర్సిటీ జియాలజీ విభాగాధిపతి, ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్ రెడ్డి అమెరికన్ జియోఫిజికల్ యూనియన్–24 అంతర్జాతీయ సదస్సులో పాల్గొననున్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలు, వాషింగ్టన్ డీసీలో ఈనెల 9 నుంచి జరిగే ఈ సదస్సులో మల్లికార్జున్‌రెడ్డి 'ట్రూ ఫిసిక్ కింబర్‌లైట్ ఫ్రమ్ రాయచూర్ కింబర్‌లైట్ ఫీల్డ్ ఈస్టర్న్ థార్వార్‌క్రెటాన్ పెనిన్సులర్ ఇండియా మినరాలజికల్ ఎవిడెన్స్ రిలేటెడ్ టూ దేయిర్ ఫార్మేషన్' అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించనున్నారు. ఈమేరకు ఆహ్వానం అందగా.. ఈనెల 6న ఆయన వెళ్లబోతున్నారు. మల్లికార్జున్‌రెడ్డిని వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి అభినందించారు.

ఎంజీఎం పిల్లల వార్డుకు వైద్య పరికరాలు




నయీంనగర్: ఎంజీఎం ఆస్పత్రి పిల్లల వార్డు, ఎన్ఐసీయూ విభాగానికి వైద్య పరికరాలు అందిస్తామని 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గురువారం వరంగల్ కలెక్టర్ సత్యశారదను కలిసి తెలిపారు. ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ కృషితో సమాజ సేవ–ఆరోగ్య సంరక్షణకు ఉపాసన కామినేని సీఎస్ఆర్ వైస్ చైర్‌పర్సన్ అపోలో హాస్పిటల్స్ వారి బిలియన్ హార్ట్స్ బీటింగ్ ఫౌండేషన్ ద్వారా వైద్య పరికరాలను డొనేట్ చేయడానికి ముందుకు వచ్చారని వెంకట్రామ్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కుడా సీపీఓ అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

అవినీటి ప్రవాహం!

గ్రేటర్‌లో కమర్షియల్ కనెక్షన్లలో భారీ అక్రమాలు

- మీటర్లు లేకుండానే నల్లా నీరు సరఫరా
- భారీ నష్టాలపై బాధ్యత లేని బల్దియా ఇంజనీర్లు
- పట్టించుకోని పాలకవర్గం, ఉన్నతాధికారులు



మహా నగరంలో ఇలా..

మొత్తం ఇళ్లు	2.20 లక్షలు
ఆస్తిపన్ను కమర్షియల్ ఇళ్లు	36,000
ట్రేడ్ లైసెన్స్‌లు	24,000 పైచిలుకు

నల్లాలు ఇలా..

డొమెస్టిక్	1,77,804
కమర్షియల్	719

- ఇలా కమర్షియల్ జోన్‌కింద అసెస్ చేసిన వాటికి సైతం డొమెస్టిక్ కింద గానీ, అనధికార నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు తేటతెల్లమవుతోంది.

వరంగల్ అర్బన్: కమిషనర్ల ఉదాసీనత.. ఇంజనీర్ల చేతివాటం.. పట్టించుకోని పాలక వర్గం.. వెరసి తాగునీటి నల్లా కనెక్షన్లలో భారీ అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. తిరగని మీటర్లు.. వేలసంఖ్యలో దొంగ కనెక్షన్లతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఏటా రూ.11కోట్ల ఆదాయానికి గండిపడుతోంది. నెల, రెండు నెలల బిల్లు కట్టకుంటే పేదలపై ప్రతాపం చూపే బల్దియా అధికారులు 'పెద్ద'లపై మమకారం చూపుతూ స్వామిభక్తిని చాటుకుంటున్నారు.

పెరగని కమర్షియల్ నల్లాలు

హైదరాబాద్ తర్వాత వరంగల్ మహానగరం విస్తరిస్తోంది. వ్యాపార, వాణిజ్య సంస్థలు, బహుళ అంతస్తులు పెరుగుతున్నాయి. కానీ, ఆ మేరకు బల్దియాకు ఆదాయం రాబట్టుకోవడంలో అధికార యంత్రాంగం పిల్లిమొగ్గలేస్తోంది. మహానగరంలో 2,20 లక్షల ఇళ్లు ఉన్నాయి. బహుళ అంతస్తులు, కమర్షియల్ భవనాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఇందులో ఆస్తి పన్ను కమర్షియల్ కింద 36వేలు ఉండగా, ట్రేడ్ లైసెన్స్ 24వేల పైచిలుకు ఉన్నాయి. కొందరు పెద్దలు, వ్యాపారులు సాధారణ గృహం (డొమెస్టిక్) కోటలో పెద్ద పెద్ద భవనాలకు నల్లా కనెక్షన్లు పొందారు. పన్నుల విభాగం వారు కమర్షియల్ జోన్ కింద అసెస్‌మెంట్ చేసినా.. ఇంజనీర్లు మాత్రం సాధారణ కోటా కింద నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. వీరంతా పెద్ద పెద్ద పైపులు పెట్టుకొని తాగునీటిని లాగేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

దశాబ్ద కాలం క్రితం 559 కమర్షియల్ కనెక్షన్లు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 719 పెరిగింది. వీటిలో 360 నీటి మీటర్లు పనిచేయడం లేదు. నెల, రెండు నెలలు కాదు. పదేళ్లుగా మీటర్లు తిరగడం లేదు. ఏ కమర్షియల్ నల్లా నుంచి ఎన్ని నీళ్లు వాడుకుంటున్నారో అంతుపట్టడం లేదు. ప్రతినెలా చార్జీ వసూలు చేయాలి. రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లలో ఒక కిలో లీటర్(వెయ్యి లీటర్లు) రూ.30, బార్, సినిమా థియేటర్లు, హోటళ్లు, ఆస్పత్రులు రూ.50 చొప్పున పన్ను చెల్లించాలి. ప్రతినెలా 5 నుంచి 10వ తేదీలోపు మీటరు రీడింగ్ తీయాలి. కానీ ఉన్న కమర్షియల్ కనెక్షన్ల మీటర్లు సగానికి పైగా తిరగడం లేదు. దీంతో నామమాత్రపు సొమ్ము విధించి వసూలు చేస్తున్నారు. ఇకపోతే చాలామేరకు కమర్షియల్ నల్లాలకు సాధారణ నల్లా కనెక్షన్ల మాదిరిగా నెలకు రూ.150 చొప్పున వసూలు చేస్తున్నారు. కాలనీల్లో ఉండే డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లకు కమర్షియల్ నల్లాలకు ప్రత్యేకంగా పెద్ద పైపు వేస్తారు. ప్రతీనీటి బొట్టును లెక్కిస్తారు. మీటర్లు పనిచేయక ఖజానాకు చిల్లు పడుతోంది. దీనివల్ల గ్రేటర్‌కు ఏటా సరఫరా చేస్తున్న నీటికి తగ్గ పన్నులు జమకాక ఖజానాకు రూ.కోట్లలో గండిపడుతోంది. ఇదంతా ఒక ఎత్తయితే.. ఆ శాఖలో సిబ్బంది లేరు. ఒకే ఒక్కరు కమర్షియల్ నల్లాలపై పర్యవేక్షిస్తున్నారు. ఈ విషయం తెలిసినా ఇంజనీర్లు, పాలకవర్గం, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏటా నష్టం రూ.11కోట్లు

గ్రేటర్ వ్యాప్తంగా చేపట్టిన సర్వేలో 4,500 కమర్షియల్ నల్లాలకు నీటి మీటర్లు లేకుండానే కనెక్షన్లు ఇచ్చినట్లు గుర్తించారు. ప్రస్తుతం ఉన్న 719 నల్లా కనెక్షన్లతో ఏడాదికి రూ.1.70 కోట్ల పైచిలుకు ఆదాయం వస్తోంది. మొత్తం కనెక్షన్లను క్రమబద్ధీకరిస్తే రూ.11కోట్ల మేర ఆదాయం వస్తుందని ఇంజనీర్లు లెక్కలు కట్టారు. అంతేకాకుండా అక్రమ కమర్షియల్ నల్లా ఉంటే క్రమబద్ధీకరణ రూపంలో రూ.3లక్షల డొనేషన్, రీ కనెక్షన్ చార్జి రూ.5వేలు, జరిమానాగా రూ.25వేలు ఇలా మొత్తం గ్రేటర్ ఖజానాకు పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతుంది.

గుర్తించి క్రమబద్ధీకరిస్తాం..

> నగరంలో కమర్షియల్ నల్లాల సంఖ్య పెరగాల్సి ఉంది. గతంలో చేసిన సర్వే ఆధారంగా మరోమారు పర్యవేక్షించి క్రమబద్ధీకరిస్తాం. అనధికారిక కనెక్షన్లు ఇవ్వకుండా చర్యలు తీసుకుంటాం.
>
> **- ప్రవీణ్ చంద్ర, బల్దియా ఎస్ఈ**

● **అయ్యప్ప శోభాయాత్ర**



వరంగల్ ఉర్సు ప్రతాప్‌నగర్‌లో శ్రీ అయ్యప్ప సేవా సమితి, నాగమయ్య కుటీరం గురుస్వామి బత్తిని సుభాష్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అయ్యప్ప శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి, గణపతి, భద్రకాళి, సరస్వతీమాత, శ్రీఆంజనేయస్వామి, భటుల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. – ఖిలా వరంగల్

ఎంజీఎంను దశల వారీగా అభివృద్ధి చేస్తాం

- ఆస్పత్రిలో వైద్యుల కొరత తీరుస్తాం
- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



నూతన ఓపీ కంప్యూటర్ కౌంటర్లను ప్రారంభిస్తున్న మంత్రి సురేఖ

ఎంజీఎం: ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రిని దశల వారీగా అభివృద్ధి చేస్తూ పేద ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని దేవాదాయ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గురువారం ఎంజీఎం ఆస్పత్రిలో రోగులకు నూతనంగా ఏర్పాటు చేసిన ఫార్మసీ, కంప్యూటర్ కౌంటర్లతో పాటు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఆస్పత్రిలో ప్రధానంగా డయాలసిస్, హృద్రోగ, పిడియాట్రిక్ విభాగాలను ప్రభుత్వ, సీఎస్ఆర్ నిధుల ద్వారా మరింత అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రిలో వైద్యుల కొరత తీర్చడంతో పాటు పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌ను నియమిస్తామన్నారు. మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా రోగుల అటెండెంట్లకు నాణ్యమైన ఆహారం అతి తక్కువ ధరకు అందించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఎంజీఎం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ కిశోర్, ఆర్ఎంలు డాక్టర్ మురళి, శ్రీనివాస్, నాయకులు కొక్కుల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

ఖిలా వరంగల్: నగరంలోని ప్రముఖ జంక్షన్ల సుందరీకరణే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. స్మార్ట్ సిటీ నిధులతో సుందరీకరించిన వరంగల్ ఆర్టీఏ, వెంకట్రామ జంక్షన్లను గురువారం కలెక్టర్ సత్యశారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా నగరం మరింత వేగంగా అభివృద్ధి వైపు ప్రయాణిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం

- రూ.100 కోట్లతో బస్టాండ్ నిర్మాణానికి కృషి
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నయీంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం టీజీఎస్ ఆర్టీసీ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో హనుమకొండ బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని మాట్లాడారు. ఉచిత బస్సు సౌకర్యాన్ని ఉమ్మడి వరంగల్ రీజియన్ పరిధిలో 9 కోట్ల మంది మహిళా ప్రయాణికులు వినియోగించుకున్నారని వారికి అయిన చార్జీలు రూ.403.70 కోట్లు ప్రభుత్వమే భరించిందన్నారు. వరంగల్ జిల్లా అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. రూ.100 కోట్ల నిధులతో హనుమకొండ బస్టాండ్ అభివృద్ధికి, కాజీపేటలో బస్టాండ్ నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ప్రజా విజయోత్సవాల నియోజకవర్గ పరిశీలకుడు ఆరెపల్లి మోహన్, టీజీఎస్ఆర్టీసీ ఆర్ఎం విజయభాను, డీఆర్ఎంలు భానుకిరణ్, మాధవరావు, డిపో మేనేజర్లు మోహన్‌రావు, భూక్యా ధరమ్‌సింగ్, ఏఓ రవీందర్, కాంగ్రెస్ నాయకులు తోట వెంకటేశ్వర్లు, నాయిని లక్ష్మారెడ్డి, ఆర్టీసీ కార్మికులు, నాయకులు తదితరులున్నారు.

విజయోత్సవాల్లో భాగస్వాములవ్వండి

హన్మకొండ చౌరస్తా: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్న సందర్భంగా శనివారం నిర్వహించనున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం హనుమకొండ డీసీసీ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమీక్షలో ఆయన మాట్లాడారు.

రేపు కేఎంటీపీకి మంత్రి శ్రీధర్‌బాబు రాక

- భూములు కోల్పోయిన 863 మంది రైతులకు ప్లాట్ల కేటాయింపు
- ఏర్పాట్లపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ సత్య శారద సమీక్ష



సమావేశంలో కలెక్టర్ శారద, ఎమ్మెల్యే రేవూరి..

వరంగల్: గీసుకొండ–సంగెం మండలాల పరిధి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్(కేఎంటీపీ)ను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు శనివారం సందర్శించనున్నారు. మంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులతో గురువారం సమీక్షించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పర్యటనకు అధికారులు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఉదయం 10 గంటలకు గొర్రెకుంటలో నిర్మించిన బ్రాహ్మణ భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారని, అనంతరం కాకతీయ టెక్స్‌టైల్ పార్కును పరిశీలించి భూములు కోల్పోయిన 863 మంది రైతులకు డ్రా పద్ధతిలో ప్లాట్ల నంబర్లు కేటాయిస్తారని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ జితేందర్‌రెడ్డి గీసుకొండ, సంగెం తహసీల్దార్లు రియాజుద్దీన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందనలు



చందన, సాయిప్రణీతలను అభినందిస్తున్న డీవైఎస్ఓ అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో ఈనెల 3న నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–19 రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో వరంగల్‌కు చెందిన చందన, హనుమకొండకు చెందిన సాయి ప్రణీత గోల్డ్ మెడల్స్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. గురువారం వారిని హనుమకొండలోని ఇండోర్‌స్టేడియంలో డీవైఎస్ఓ గుగులోతు అశోక్‌కుమార్ అభినందించారు. అథ్లెటిక్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, బ్యాడ్మింటన్ సంఘం జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, పీఈటీ శోభ, ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ ప్రభుదాస్ ఉన్నారు.

జాతీయస్థాయికి ఎంపిక చేయలేదు..

రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–19 బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించినా జాతీయ స్థాయికి ఎంపిక చేయలేదని హనుమకొండకు చెందిన రిషితగౌడ్, భవ్యశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు.

అంతఃకరణ.. పునశ్చరణ

బ్లాక్ బోర్డు.. సుద్దముక్క ఒకప్పుడు. ఎల్ఈడీ స్క్రీన్లు. డిజిటల్ తరగతులు.. వీడియోలు, స్లైడ్ షోలు. రిమోట్‌తో ఇంటరాక్టివ్ ప్యానెళ్లు ఇప్పుడు. అంతేకాదు.. ఎప్పుడంటే అప్పుడు టీచర్ చెప్పింది తిరిగి వినే సదావకాశమూ విద్యార్థులకు ఉంది. ఈ–కంటెంట్‌తో విద్యనందిస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటోంది పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాల. ఈ–స్మార్ట్ ముచ్చట 'సాక్షి' ప్రత్యేకం. – కాజీపేట అర్బన్



ఇంటరాక్టివ్ ప్యానెళ్లతో విద్యాబోధన

పాఠాలు నిక్షిప్తం.. సందేహాలు నివృత్తం

- కేంద్రీయ విద్యాలయంలో ఈ–ఎడ్యుకేషన్
- ఆకట్టుకుంటున్న గ్రీన్ టు వైట్ బోర్డ్
- ఆసక్తిగా పాఠ్యాంశాలు వింటున్న విద్యార్థులు

కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాల కార్పొరేట్‌కు దీటుగా ఈ–కంటెంట్‌తో విద్యనందిస్తోంది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సాయంతో మేం సైతం విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తామంటోంది. రిమోట్ సాయంతో ఇంటరాక్టివ్ ప్యానెళ్లను తరగతి గదుల్లో ఏర్పాటు చేసి పాఠ్యాంశాలు బోధిస్తోంది.

గ్రీన్ టు వైట్ బోర్డ్

కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో గతంలో తరగతి గదుల్లో బోధనకు గాను గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ–కంటెంట్ బోధనకుగాను ఇంటరాక్టివ్ ప్యానెళ్లు ఏర్పాటు చేశారు. గ్రీన్ బోర్డులపై చాక్ పీస్‌తో రాసి ఉపాధ్యాయులు బోధన కొనసాగించేవారు. కానీ ఇకపై ఇంటరాక్టివ్ ప్యానెళ్లలో ఇంటర్నల్‌గా రూపొందించబడిన ఈ–కంటెంట్‌తో పాఠ్యపుస్తకాల్లో అంశాలనే నేరుగా ప్రదర్శిస్తూ విద్యాబోధన కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా ఇంటరాక్టివ్ ప్యానెళ్లతో మరో సౌకర్యం ఉంది. అదే వైట్‌బోర్డుగా ఇంటరాక్టివ్ ప్యానెళ్లను ఉపయోగించే అవకాశం. వైట్ బోర్డు ఉపయోగానికి ప్రత్యేకంగా యాప్‌ను ఇంటరాక్టివ్ ప్యానెళ్లలో ఏర్పాటు చేశారు. ఈయాప్‌ను రిమోట్ ద్వారా క్లిక్ చేస్తే చాలు.. వైట్ బోర్డుగా మారిపోతుంది. ఉపాధ్యాయులు దానిపై స్టైలస్ పెన్‌తో రాస్తూ.. విద్యాబోధన కొనసాగిస్తారు. ఇలా రాసిన అంశాలు ఇంటర్నల్ మెమోరీలో భద్రంగా ఉంటాయి. విద్యార్థులకు సందేహాలు వచ్చినా.. ఎప్పుడంటే అప్పుడు తిరిగి చూసుకునే అవకాశం ఉంటుంది. ఈ–ఎడ్యుకేషన్‌ను అన్ని తరగతుల్లో ఏర్పాటు చేయడంతో.. విద్యార్థులు బోధనా పాఠ్యాంశాలు ఎప్పుడైనా తిరిగి పునశ్చరణ చేసే అవకాశం ఉంటుంది.

పీఎం శ్రీవీవీఎస్ సౌజన్యంతో..

కేంద్రీయ విద్యాలయ పాఠశాల పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంగా రూపాంతరం చెందిన తర్వాత పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధిని అందజేస్తోంది కేంద్రీయ విద్యాలయ సంఘటన్. ఇందులో భాగంగా ఇంటరాక్టివ్ ప్యానెళ్లకుగాను నిధిని అందజేయగా.. ఒక ప్యానెల్‌ను పీఎం శ్రీ సౌజన్యంతో మరో తొమ్మిది ప్యానెళ్లను విద్యాలయ వికాస్ నిధి సౌజన్యంతో ఇక్కడ ఏర్పాటు చేశారు.

ఇష్టంగా వింటున్నాం..



> ఇంటరాక్టివ్ ప్యానెళ్లను నూతనంగా మా పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఇంటరాక్టివ్ ప్యానెళ్లలో మా సబ్జెక్ట్ టీచర్ బోధిస్తుంటే చాలా బాగా వినాలనిపిస్తోంది. స్క్రీన్‌పై రాసింది ఎంతో ఆసక్తిగా నేను మా ఫ్రెండ్స్ చూస్తున్నాం. మా పాఠశాలలో ఈ–ఎడ్యుకేషన్ ప్రారంభించడం సంతోషంగా ఉంది.
>
> **- అంజలి, 8వ తరగతి**

భలే ఉంది..



> క్లాస్ రూంలో గ్రీన్ బోర్డుపై టీచర్ చాక్‌పీస్‌తో రాస్తుంటే నోట్సులో రాసుకోవడం అలవాటయ్యింది. కాగా గ్రీన్ బోర్డు స్థానంలో ఇంటరాక్టివ్ ప్యానెల్ వైట్ బోర్డుగా మారిపోవడం చాలా కొత్తగా ఉంది. టీచర్ చెప్పిన పాఠాల్లో సందేహాలు వస్తే తిరిగి చూసుకునే అవకాశం ఇందులో ఉంది. ఎప్పుడంటే అప్పుడు తిరిగి చూసుకోవచ్చు.
>
> **- సుచరిత, ఎనిమిదో తరగతి**

పాఠ్యాంశాలు వీడియో రూపంలో..



> పాఠ్యాంశాలను కేవలం మేం చదివి బోర్డుపై రాసి నేర్పించడమే కాదు.. వీడియో రూపంలోనూ నేర్పించేందుకు ఇంటరాక్టివ్ ప్యానెళ్లు తోడ్పడుతున్నాయి. వైఫై, పెన్‌డ్రైవ్‌లను కనెక్ట్ చేసి ఆసక్తికరంగా విద్యాబోధన కొనసాగిస్తున్నాం. పాఠాలు దృశ్య రూపంలో చూసినప్పుడు ఎక్కువగా గుర్తుంచుకునే అవకాశం ఉంటుంది.
>
> **- స్మిత, టీచర్, కేవీ**

ఉపాధ్యాయుడు సంతోష్‌కు అవార్డు



సంతోష్‌ను అభినందిస్తున్న డీఈఓ జ్ఞానేశ్వర్

కాజీపేట సెంటర్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు గంధం సంతోష్.. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డీఈఓ జ్ఞానేశ్వర్ గురువారం సంతోష్‌ను అభినందించి మాట్లాడారు. ఎంఈఓ రవీందర్, సంఘాల బాధ్యులు మహేందర్, రవీందర్‌రెడ్డి, అబ్దుల్ గఫార్, హెచ్ఎం వెంకన్న, పీఈటీ అశోక్ పాల్గొన్నారు.

మోదీ విధానాలతో దేశానికి ముప్పే

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



లోగోను ఆవిష్కరిస్తున్న తమ్మినేని తదితరులు

న్యూశాయంపేట: ప్రధాని నరేంద్రమోదీ విధానాలతో భవిష్యత్‌లో దేశానికి ముప్పు వాటిల్లనుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. హసన్‌పర్తిలో ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న పార్టీ హనుమకొండ జిల్లా 2వ మహాసభల లోగోను ఆయన గురువారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఉద్యమాల ద్వారా చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య మాట్లాడుతూ లగచర్లలో ఫార్మా కంపెనీ రద్దు కమ్యూనిస్టులు ముందుండి పోరాడటం వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రజాఉద్యమాలు నిర్వహించి బలమైన శక్తిగా ఎదుగుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పి.సుదర్శన్, నాయకులు చక్రపాణి, వాసుదేవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చుక్కయ్య, రమేశ్, వెంకట్, వీరన్న, రాములు, తిరుపతి, లింగయ్య, దీప పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లిని గెంటేసిన కూతురు

న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తల్లి రామక్క



నెల్లికుదురు: కడదాక కాపాడు తానని చెప్పి తల్లి వద్ద ఉన్న డబ్బు మొత్తం తీసుకున్న ఓ కూతురు.. మాట తప్పి తల్లిని ఇంటి నుంచి గెంటివేసింది. ఈ ఘటన గురువారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం చిన్న ముప్పారంలో చోటు చేసుకుంది. బాధితురాలు, తల్లి పాదిల రామక్క కథనం ప్రకారం.. రామక్కకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉంది. వృద్ధాప్యంలో ఉన్న రామక్క తన వద్ద డబ్బులన్నీ కొడుకుల సమక్షంలో తన కూతురు ముదిరికోల్ల ధనమ్మకు అప్పగించి తాను కూతురు వద్దనే ఉంటానని తెలిపింది. ఇన్ని రోజులు కాలం గడించిందని, ఇప్పుడు నీకు, నాకు ఎలాంటి సంబంధం లేదని ఇంటి నుంచి వెళ్లిపోవాలని తల్లి రామక్కను కూతురు ఇంటి నుంచి వెళ్లగొట్టింది. దీంతో బాధితురాల తనకు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

మావోయిస్టు జైసింగ్ మృతదేహం అప్పగింత

ఏటూరునాగారం: చెల్పాక అడవుల్లో ఈనెల 1న జరిగిన పోలీసు ఎదురుకాల్పుల్లో మృతి చెందిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగులూరు పోలీస్‌స్టేషన్ పరిధి కుసునూరుకు చెందిన మావోయిస్టు కమిటీ సభ్యుడు జైసింగ్ మృతదేహాన్ని గురువారం తల్లి పాట్టెం సన్ని, సోదరుడు పాట్టెం లక్ష్మణ్‌కు అప్పగించారు. ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత మృతుడి వివరాలను కుటుంబ సభ్యులకు తెలిపినప్పటికీ ఆలస్యంగా రావడంతో మంగపేట ఎస్సై సూరి, మరో ఎస్సై సురేష్ ఆధ్వర్యాన అప్పగించారు.

నేడు మధు మృతదేహం తరలింపు

ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఏగొలపు మల్లయ్య అలియాస్ మధు మృతదేహాన్ని శుక్రవారం తీసుకువెళ్లనున్నట్లు అతడి భార్య మీనా తెలిపారు. హైకోర్టు పిటిషనర్ న్యాయవాది, ప్రభుత్వాధికారి, తహసీల్దార్, బంధువుల సమక్షంలో మృతదేహాన్ని పరిశీలించి భార్యకు అప్పగించనున్నారు. మధు దహన సంస్కారాల అనంతరం కోర్టులో విచారణ చేయనున్నట్లు సమాచారం.

గృహప్రవేశం చేసిన మరునాడే మృత్యుఒడికి..


- విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి
- నర్సింహులగూడెంలో ఘటన



నర్సయ్య (ఫైల్)

నెల్లికుదురు: గృహ ప్రవేశం చేసిన మరునాడే ఓ వ్యక్తి మృత్యుఒడికి చేరాడు. విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలో చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెదగోని నర్సయ్య (45) ఈ నెల 4న గృహ ప్రవేశం చేశాడు. అద్దె ఇంట్లో ఉన్న సామాన్లు నూతన గృహంలోకి తరలిస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ గురై కిందపడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి నర్సయ్య మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు.

పుల్లూరులో రైతు..



లాలు (ఫైల్)

గార్ల: వ్యవసాయ బావి వద్ద మోటార్‌కు మరమ్మతు చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై బావిలో పడి ఓ గిరిజన రైతు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం గార్ల మండలం పుల్లూరు సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై జీనత్‌కుమార్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బోటితండాకు చెందిన కొర్ర లాలు(55)కు మానుకోట జిల్లా గార్ల మండలం పుల్లూరు పంచాయతీలో వ్యవసాయ భూమి ఉంది. మిరప తోటకు నీళ్లు కట్టేందుకు మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లగా మరమ్మతుకు గురైంది. దీంతో మరమ్మతు చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై పక్కన ఉన్న వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య అచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటల్లో ఆణిముత్యాలు

మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ



ఆశ్రమ పాఠశాలలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్, వార్డెన్ వీరమ్మ

- రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సొంతం

నల్లబెల్లి: క్రీడల సాధనకు అనువైన ప్రాంగణం.. ఆటలపై ఆసక్తి ఉన్న బాలికలకు మెళకువలు నేర్పించేందుకు అనుభవం కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు. వారి ప్రోత్సాహంతో ప్రణాళికాబద్ధంగా చదువుతోపాటు క్రీడల్లో సత్తా చాటుతూ ముందుకు సాగుతున్నారు. దీంతో క్రీడాపోటీలు ఎక్కడ జరిగినా ప్రతిభకనబరిచి పతకాలు సాధిస్తున్నారు. ఆశ్రమ పాఠశాలలో అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. మరింత సహకారం అందిస్తే అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నామంటున్నారు మండలంలోని మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన పలువురు క్రీడాకారులు..

క్రీడలు, చదువుకు సమ ప్రాధాన్యం..

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుకు, క్రీడలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో కబడ్డీ, వాలీబాల్, ఖోఖోతోపాటు అథ్లెటిక్స్‌లోనూ విద్యార్థినులు రాణిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థినులు సాధన చేస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరుస్తున్నారు. భవిష్యత్‌లో మరింత రాణిస్తామని విద్యార్థినులు చెబుతున్నారు.

కబడ్డీలో పట్టు సాధించిన నాగేశ్వరి



పర్వతగిరి మండలంలోని పంచరాయితండాకు చెందిన రైతు బానోత్ వెంకన్న–భారతి దంపతుల కుమార్తె నాగేశ్వరి. తల్లిదండ్రులు మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల పాఠశాలలో ఆమెను ఐదో తరగతిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె పదో తరగతి చదువుతోంది. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో కబడ్డీలో నిత్యం సాధన చేస్తోంది. మెళకువలు నేర్చుకుని నాగేశ్వరి పట్టు సాధించింది. గత నెల 5, 6, 7 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–17 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. అంతేకాకుండా గతంలో ఏటూరునాగారంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం, భద్రాచలంలోని కిన్నెరసానిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చింది.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ..



నర్సంపేట మండలంలోని పర్శనాయక్ తండాకు చెందిన కొర్ర శ్రీను కుమార్తె శ్రుతి ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. విజయం సాధించాలనే లక్ష్యంతో బరిలో దిగుతుంది. మెదక్‌లో జరిగిన అండర్–14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయస్థాయిలో విజయం సాధించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో ఉదయం, సాయంత్రం శిక్షణ తీసుకుంటోంది.

అంతర్జాతీయ పోటీలకు శిక్షణ..



బానోత్ రాజేశ్వరి మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తోంది. ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో వాలీబాల్ పోటీల్లో రాణించేందుకు నిరంతరం సాధన చేస్తోంది. ఇప్పటి వరకు రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యేలా పాఠశాలలో శిక్షణ పొందుతోంది. చదువును ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఆటల్లో రాణిస్తోంది.

విద్యార్థినులను ప్రోత్సహిస్తున్నాం..




విద్యార్థినులకు క్రీడల్లో ఆసక్తి పెంచేలా ప్రోత్సహిస్తున్నాం. వారిలోని ప్రతిభ ఆధారంగా క్రీడల్లో మెళకువలు నేర్పిస్తున్నాం. మెరుగైన శిక్షణను అందించి జాతీయస్థాయిలో పతకాలు సాధించేలా తీర్చిదిద్దాలన్నదే నా ఆశయం. ఇప్పటికే విద్యార్థినులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు.

– బానోత్ దేవీలాల్, పీడీ

అభివృద్ధి దిశగా ఉర్సు గుట్ట

- ‘ఫోర్ షోర్డ్ డెవలప్ మెంట్ ఆఫ్ ఉర్సుగుట్ట లేక్’లో కదలిక
- మంత్రి కొండా సురేఖ ఆదేశాలతో ముందుకెళ్లనున్న ప్రాజెక్టు
- రూ.14.50 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభమైతే మరో టూరిస్ట్ స్పాట్



సాక్షి, వరంగల్: పర్యాటక ప్రాంతంగా ఉర్సుగుట్ట అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. స్మార్ట్ సిటీలో భాగంగా ఐదేళ్ల క్రితం ఈ చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించారు. టెండర్ వరకు వచ్చి ఆగడంతో మళ్లీ దీనిని పట్టించుకునేవారు లేక పోవడంతో అటకెక్కింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఆధ్వర్యంలో రూ.14.50 కోట్ల అంచనాతో రూపొందించిన ‘ఫోర్ షోర్డ్ డెవలప్ మెంట్ ఆఫ్ ఉర్సుగుట్ట లేక్’ పనులపై వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ దృష్టి సారించారు. త్వరలోనే ఈ ప్రాజెక్టు ముందుకెళ్లే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు అధికారులు కూడా పూర్తిస్థాయిలో నివేదికను సిద్ధం చేసినట్లు తెలిసింది.

సకల సౌకర్యాలతో అభివృద్ధి ఇలా..

ఉర్సుగుట్ట చెరువు దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీనికి రెండువైపులా బండ్ సుందరంగా తీర్చిదిద్దే అవకాశముంది. ఇంకోవైపు స్టేట్ హైవే ఉండడం, మరో వైపు ఓపెన్ బండ్ ఉండడం వల్ల పనులకు కాస్త ఇబ్బందిగా పరిణమించనుంది. అయితే అవకాశమున్న చోట మాత్రమే బండ్‌ను సకల సౌకర్యాలతో తీర్చిదిద్దేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. చెరువుకు 750 మీటర్ల పొడవున్న ఆరుమీటర్ల వెడల్పుతో సైక్లింగ్ ట్రాక్, 1700 మీటర్ల పొడవున్న వైపు మూడు మీటర్ల వెడల్పుతో వాకింగ్ ట్రాక్‌తోపాటు పర్యాటకులు కూర్చునేలా సరికొత్త హంగులతో సిట్టింగ్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే, ఉర్సుగుట్ట పక్కనే ఓపెన్ జిమ్ ఏర్పాటుచేయడం కూడా నగరవాసుల ఆరోగ్యానికి ఉపయోగపడనుంది. అక్కడే ఉన్న మైదానంలో పిల్లలు క్రికెట్, పెద్దలు వాలీబాల్ ఆడుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు. నడిచేందుకు టైల్స్, రాత్రివేళ కళ్లు మిరుమిట్లు గొలిపేలా లైట్లు అమర్చనున్నారు. అలాగే బతుకమ్మ, వినాయక నిమజ్జన పాయింట్లు ఉన్న ప్రాంతంలో కెఫెటేరియా నిర్మించనున్నారు. దిమ్మెలపై టెంట్ ఆకారంతో ఏర్పాటుచేసే కుర్చీల్లో కూర్చొని సరస్సులోని అలలను చూస్తూ.. ఇష్టమైన ఆహారం తీసుకుంటూ కుటుంబంతో సరదాగా గడిపేలా ప్రణాళికలు రూపొందించారు. అలాగే, మూడు నుంచి పదేళ్లలోపు పిల్లలకు సైన్స్ పార్కు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ ప్రాజెక్టు పనులు మొదలైతే ఏడాదిన్నరలోపు పూర్తయ్యే అవకాశముంటుందని బల్దియా ఇంజనీరింగ్ విభాగాధికారి ఒకరు తెలిపారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం



బాలు(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : అప్పుల బాధతో ఓ రైతు గడ్డి మందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేవుల తండా గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ బాలు (55)కు 1.30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతేడాది ఎకరం మిర్చి సాగు చేయగా అప్పులు కావడంతో పాటు దిగుబడిరాక ఆర్థికంగా నష్టపోయాడు. బ్యాంకులో రూ.2 లక్షలు, ఇతరుల వద్ద రూ.లక్ష.. మొత్తం 3 లక్షల వరకు అప్పులయ్యాయి. ఈ ఏడాది మొక్కజొన్న సాగుచేశాడు. దిగుబడి వస్తుందో.. రాదోనని మనోవేదనకు గురయ్యాడు. దీంతో బుధవారం సాయంత్రం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి తెలిపారు.

పట్టపగలు.. రెండు ఇళ్లలో చోరీ



ఘటనా స్థలిలో వివరాలు సేకరిస్తున్న ఫింగర్ ప్రింట్ బృందం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో దొంగలు పట్టపగలే రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. అనంతరం మరో ఇంట్లో కూడా చోరీకి యత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మానుకోట జిల్లా కేంద్రంలోని మల్లం బజార్‌కు చెందిన మహేందర్, స్రవంతి దంపతులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో దొంగలు ఇంటి తలుపు తాళం తొలగించి ఆరు బంగారు లక్ష్మీదేవి కాయిన్లు, రూ. ఆరు వేల నగదు అపహరించుకెళ్లారు. అనంతరం బెస్త బజార్‌కు చెందిన జంగిలి హరీశ్ ఇంట్లో ఏడు తులాల వెండి, ముప్పావు తులం బంగారు ఆభరణాలు, రూ. ఆరు వేల నగదు అపహరించారు. అక్కడి నుంచి పక్కన ఉన్న దుగ్గి పూలమ్మ ఇంట్లో కూడా చోరీకి యత్నించారు. ఇక్కడ నగదు లభించలేదు. ఈ ఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి.విజయ్ కుమార్, ఫింగర్ ప్రింట్ బృందంతో కలిసి ఘటన స్థలాలకు చేరుకుని ఆధారాలు సేకరిస్తున్నారు.

రేపటి నుంచి వార్షిక సమావేశం

కేయూ క్యాంపస్: ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా 49వ వార్షిక కాంగ్రెస్, 43వ ప్లేస్‌నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక కాంగ్రెస్ సమావేశాన్ని ఈనెల 7 నుంచి 9 వరకు నిర్వహించనున్నారు. కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ విభాగం అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సోషల్ సైన్స్ డీన్, లోకల్ సెక్రటరీ ప్రొఫెసర్ టి.మనోహర్, ఆ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్.రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసనాల ద్వారా వాస్తవిక చరిత్రను వెలికి తీయడంపై ఈకాన్ఫరెన్స్‌లో చర్చ ఉంటుందని తెలిపారు. ఈప్రారంభ సమావేశాన్ని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరగనుంది. మైసూర్ ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్‌ప్రసిడెంట్ డాక్టర్ ఎస్ స్వామినాథన్, యూనివర్సిటీ ఆఫ్ కలకత్తా యన్షియంట్ ఇండియన్ హిస్టరీ అండ్ కల్చర్ విభాగాధిపతి, ప్లేస్ నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్ ప్రెసిడెంట్ ఆచార్య సుస్మిత బసు మజుందార్, యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేశ్‌లాల్ పాల్గొననున్నట్లు వారు తెలిపారు.

సేంద్రియ పంటలతోనే నేల సారవంతం



మృత్తిక దినోత్సవంలో రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులు

వరంగల్ : సేంద్రియ పంటలతోనే నేల సారవంతమవుతుందని వరంగల్ నాబార్డ్ సీజీఎం ఎల్.చంద్రశేఖర్ అన్నారు. గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా ఆరెపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నాబార్డు వరంగల్ ఆర్థిక సాయంతో రైతులు, విద్యార్థులు, శాస్త్రవేత్తలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని సంరక్షించడానికి కావాల్సిన సేందియ పంటలు పండించాలన్నారు. రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట, ఎరువులు, విత్తనాలను పండించడానికి కావాల్సిన ఆర్థిక సాయాన్ని రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు నాబార్డు అందిస్తుందన్నారు. మృత్తిక శాస్త్రవేత్త, పరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి మాట్లాడుతూ భూమిపై మానవ జీవితం ఆరోగ్యకర నేలలపై ఆధారపడి ఉంటుందన్నారు. నేల ఆరోగ్య పరిరక్షణలో అనేక మార్గాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ కాలేజ్ వరంగల్ డీన్ వెంకట్‌రెడ్డి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్, శిక్షణ నిర్వాహకుడు డాక్టర్ సీహెచ్.రాములు, తదితరులు పాల్గొన్నారు.

సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలు ప్రశాంతం

- నేడు ముగియనున్న రైల్వే ఎలక్షన్లు



కాజీపేట రైల్వే ఎన్నికల శిబిరం వద్ద నాయకులు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో బుధవారం ప్రారంభమైన ‘రైల్వే వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్’ సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. వివిధ రైల్వే డిపోలు, కార్యాలయాలు, షెడ్లలో పని చేస్తున్న రైల్వే విభాగాల కార్మికులు తరలివచ్చి ఓటు వేశారని రైల్వే జనరల్ బ్రాంచ్ చైర్మన్ డి.శ్రీనివాస్‌యాదవ్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ముగింపు రోజు రన్నింగ్ స్టాఫ్ లోకోపైలెట్లకు ఎన్నికలు ఉంటాయన్నారు. జమ్మికుంట రైల్వే మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ చైర్మన్ వి.రాజయ్య, సెక్రటరీ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓటర్లు అయిన కార్మికులకు కాజీపేటలో ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్ వివరాలు తెలిపి పోల్ చీటీలు పంపిణీ చేశారు.

పోలింగ్ శాతం

ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగినట్లు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ చింత మురళి తెలిపారు. ఇందులో డీజిల్‌షెడ్ పోలింగ్ కేంద్రం–13లో 287, ఎలక్ట్రిక్‌షెడ్ పోలింగ్ కేంద్రం–14లో 174, రైల్వే ట్రైనింగ్ స్కూల్ సెంటర్ పోలింగ్ కేంద్రం–37లో 280, డివిజనల్ ట్రైనింగ్ సెంటర్ పోలింగ్ కేంద్రం–11లో 188, డివిజనల్ ట్రైనింగ్ సెంటర్ పోలింగ్ కేంద్రం–12లో 309 ఓట్లు పోలయ్యాయని చెప్పారు.

భార్య మరణించిన మూడు రోజులకే..

- తనువు చాలించిన భర్త




సంజీవరావు, భాగ్యమ్మ(ఫైల్)

దుగ్గొండి/ ఖిలావరంగల్: జీవితం చివరి అంకానికి చేరింది.. వృద్ధాప్యం మీద పడింది.. నిత్యం సేవలందిస్తూ సపర్యలు చేసే భార్య మృతి చెందింది.. కడుపున పుట్టినవారు ఖండాంతరాల్లో ఉన్నారు. ఇక తాను ఉండలేనంటూ గ్రామస్తులతో చెప్పిన భర్త రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బంధంపల్లిలో చోటుచేసుకుంది. బంధంపల్లికి చెందిన పల్లం సంజీవరావు(72) ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ 2010లో రిటైర్డ్ అయ్యాడు. అప్పటికే మొదటి భార్యకు ఇద్దరు కుమారులు ఉన్నా ఆమె విడాకులు తీసుకుని వెళ్లి పోయింది. రెండో పెళ్లి చేసుకుని జీవనం సాగిస్తున్న క్రమంలో ఆమె మృతి చెందింది. మళ్లీ మూడేళ్ల క్రితం వంగరి భాగ్యమ్మ మూడో పెళ్లి చేసుకున్నాడు. ఆమె మూడు రోజుల క్రితం ఇంట్లోనే మృతి చెందింది. అంత్యక్రియల అనంతరం బంధువులంతా బుధవారం వెళ్లిపోయారు. సంజీవరావు మాత్రమే మిగిలారు. ఇక తనకు ఎవరూ తోడులేరని గురువారం తెల్లవారుజామున బయటకు వెళ్లి వరంగల్ సమీపంలోని ధర్మారం వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

30 ఏళ్లకు వచ్చి తలకొరివి పెట్టి..

సంజీవరావు మొదటి భార్యకు ఇద్దరు కుమారులున్నారు. ఆమె విడాకులిచ్చిన తర్వాత వారితో సంబంధం తెగింది. తర్వాత రెండు వివాహాలు చేసుకోగా వారికి సంతానం లేదు. మొదటి భార్య పెద్ద కుమారుడు ప్రవీణ్ ములుగు జిల్లా కేంద్రంలో, రెండో కుమారుడు అరుణ్ అమెరికాలో స్థిరపడ్డారు. సంజీవరావు మృతి సమాచారాన్ని ప్రవీణ్‌కు అందించి సర్దిచెప్పగా తలకొరివి పెట్టడానికి ఒప్పుకున్నాడు.

మట్టెవాడ పోలీసుల అదుపులో హత్య నిందితుడు?

రామన్నపేట : వరంగల్ నగరంలోని రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగిని హత్య చేసిన నిందితుడిని మట్టెవాడ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హత్యకు గల కారణాలపై విచారణ చేపడుతున్నారు. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి రాజమోహన్ (62) తన శరీరంపై నిత్యం పెద్ద ఎత్తున బంగారం వేసుకుని తిరగడంతో బంగారంపై కన్ను వేసి హత్య చేశాడా..? ఏమైనా ఆర్థిక లావాదేవీల కోసం హత్య చేశాడా అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు

- నిట్ ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్
- ‘సుమతిరెడ్డి’లో అభిజ్ఞాన్ 3.0 వేడుకలు షురూ



ఆనంద్ కిశోర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి

హసన్‌పర్తి: సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలని నిట్ ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్ అన్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారు ఎస్సార్ యూనివర్సిటీ ప్రాంగణంలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న అభిజ్ఞాన్ 3.0 వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమానికి ఆనంద్ కిశోర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తులు వెలికితీయొచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈసందర్భంగా బెంగళూరుకు చెందిన సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్ రూపక్ వోలేటి ఎథికల్ హ్యాకింగ్, సైబర్ సెక్యూరిటీ అంశాలపై ప్రయోగాత్మకంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఈఈఈ అడ్వైజర్ మూల రాము, డాక్టర్ మహేందర్, డాక్టర్ శ్రీవాణి, ఏట వేణుగోపాలస్వామి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర అందించడంలో సీసీఐ విఫలం

- రైతు కమిషన్ వెల్ఫేర్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి



పత్తి యార్డులో ధర గురించి రైతులను అడిగి తెలుసుకుంటున్న కోదండరెడ్డి

వరంగల్: పత్తి రైతులకు మద్దతు ధర అందించడంలో సీసీఐ విఫలమైందని, ఈవిషయాలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని రైతు కమిషన్ వెల్ఫేర్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. గురువారం ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌ను కమిషన్ వెల్ఫేర్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, సభ్యులు కెవిఎన్.రెడ్డి, సునీల్, భవానీరెడ్డి, గోపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈసందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీసీఐ మార్కెట్‌కి వచ్చిన పత్తిని కొనుగోలు చేయాలన్నారు. కాగా, గోనె సంచుల్లో ఉన్న పత్తిని కూడా కొనుగోలు చేసేలా కేంద్ర ప్రభుత్వం, సీసీఐపై ఒత్తిడి చేస్తామని రైతులకు కోదండరెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం మార్కెట్ కార్యాలయంలో కార్యదర్శి పి.నిర్మల అధ్యక్షతన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీసీఐ లాభాల్లో ఉందని, రైతులను నష్టాల్లో పడేయడం సరికాదన్నారు. ఎంఎస్‌పీ ప్రకారం ప్రతి రైతు దగ్గర పత్తి కొనుగోలు చేయాలని సూచించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనం..

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయాన్ని గురువారం రైతు వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు.. కోదండరెడ్డికి తీర్థప్రసాదాలు, మహాదాశీర్వచనం అందజేశారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

రూ.20 లక్షల విలువైన ఆభరణాలు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు చూపుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో పలు ప్రాంతాల్లో దొంగ తనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. అక్టోబర్ 27న కాటారం మండలం శంకరంపల్లిలో దొంగతనం జరగ్గా బాధితుల ఫిర్యాదు మేరకు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు ఆధ్వర్యాన మూడు టీంలు విచారణ ప్రారంభించి సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించినట్లు చెప్పారు. మంచిర్యాలకు చెందిన తాటికొండ స్వామి, ఆసిఫాబాద్ జిల్లా తిర్యానికి చెందిన కూరాసేనగా ఈశ్వర్, మహారాష్ట్ర సిరొంచకు చెందిన పనేం రాజేష్.. మహారాష్ట్రలోని చంద్రాపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం, గణపురం మండలం చెల్పూర్, కొయ్యూర్, హనుమకొండ జిల్లాలోని సుబేదారి, పెద్దపల్లి జిల్లాలోని మంథని, గుంజమడుగు, ములుగు జిల్లాలోని పస్రా ప్రాంతాల్లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల పస్రాలో దొంగిలించిన బంగారం, రెండు బైకులను వెక్రయించడానికి వెళ్తుండగా బుధవారం కాటారం మండల పరిధి మద్దులపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. నిందితుల నుంచి 17.3 తులాల బంగారం, 83 తులాల వెండి ఆభరణాలు, ఆరు ద్విచక్ర వాహనాలు, ఒక ఎల్‌ఈడీ టీవీ, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ కిరణ్‌ఖరే వివరించారు.